

అప్రమత్తంగా ఉండాలి...

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- 9063211298, టోల్ ఫ్రీ నెం.1077కు సమాచారం ఇవ్వండి
- అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

5

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
3
ఆదివారం, 1 సెప్టెంబరు 2024



67 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దుర్గం రామచందర్

మణుగూరు, ఆగస్టు 31: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆగస్టు నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిలో 67 శాతాన్ని నమోదు చేసిందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం జీఎం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏరి యా ఉత్పత్తి ఉత్పాదకత, సంక్షేమాల విషయాలను వెల్లడించారు. ఆగస్టులో ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 7,98,500 టన్నులు కాగా 5 36,474 టన్నులను సాధించారని తెలిపారు. 6,95,105 టన్నుల బొగ్గును ఎగుమతి చేశామన్నారు. ఏరియా ఉత్పత్తితోపాటు కార్మికుల సమస్యల పరిష్కారం, వారికి అందాల్సిన సంక్షేమాలకు సముచిత ప్రాధాన్యతను కల్పిస్తూ తగిన చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, ఏజీఎం సివిల్ డి వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కొండాపురం యూజీ మైన్ వీరభద్ర రావు, డీజీఎం పర్సనల్ రమేష్, ఐఈ డీజీఎం వెంకట్‌రావు, డీవైసీఎం మేరి కుమారి, సెక్యూరిటీ అధికారి పాల్గొన్నారు.


ఎర్రుపాలెంలో నీటి మునిగిన పత్తి చేను


ఖమ్మం-బోనకల్ రహదారిలో నాగులవంచ వద్ద రోడ్డుపై బండి రేవు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రహదారిని మూసివేసిన దృశ్యం


మధిర మండలం రాయపట్నం బీసీ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు

వాన జోరు.. వరద హోరు..

వరుణ ప్రతాపం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కుండపోత

- పలుచోట్ల పొంగుతున్న వాగులు
- ఎర్రుపాలెం మండలంలో అత్యధికంగా 21.2 సెం.మీ. వర్షం
- మధిర మండలంలో వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- సింగరేణి ఓసీల్లో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి


నల్లచెరువు వాగు పొంగడంతో నీటమునిగిన వరి పొలాలు

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది. ఎడతెగకుండా వర్షం పడుతుండటంతో పలుచోట్ల చెరువులు, వాగులు, ఏర్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఖమ్మం జిల్లాలో సగటున 9.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి 9 గంటల వరకు ఎర్రుపాలెం మండలంలో అత్యధికంగా 21.2 సెం.మీ. వర్షం కురిసింది. మధిరలో 19.2 సెం.మీ., బోనకల్ 10.4.సెం.మీ., వేంసూరులో 7సెం.మీ., వైరాలో 6.9సెం.మీ., తల్లాడలో 6.1సెం.మీ., సత్తుపల్లిలో 6.8సెం.మీ, పెనుబల్లిలో 4.2సెం.మీ, కల్లూరు 3.8సెం.మీ., ఏన్కూరు 4.2 సెం.మీ., కొణిజర్ల 6.1సెం.మీ., రఘునాథపాలెం 6.6 సెం.మీ., తిరుమలాయపాలెం 6సెం.మీ., నేలకొండపల్లి 6.2 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. మిగిలిన అన్ని మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది.

ఎర్రుపాలెం మండలంలో కట్టలేరు, వైరా నదులు పొంగి ప్రవహించడంతోపాటు పొరుగున ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నందున ఎర్రుపాలెం మండలాన్ని వరద చుట్టుముట్టింది. ఎర్రుపాలెం మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నాగులవంచ సమీపంలో బండిరేవు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఖమ్మం-బోనకల్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

మధిర మండలం కృష్ణాపురం వద్ద పాలవాగు పొంగడంతో మధిర-వైరా మధ్య రాకపోకలు నిలిచాయి. మధిర మండలం వంగవీడు చెరువు ప్రాంతంలో తోటపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేపల చెరువులో వల సరిచేసేందుకు వెళ్లి వరదలో చిక్కుకున్నాడు. అతడు సమీపంలోని ఓ చెట్టును ఎక్కాడు. ఇదే మండలంలోని క్రిష్ణాపురం పాలవాగు సమీపంలోని రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు నీటిలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. అప్రమత్తమైన అధికారులు ఆ బస్సును సిరిపురం వైపు పంపించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో భారీ వర్షాలతో సింగరేణిలో 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఖమ్మంలో మున్నేరుతో పాటు వైరా

(మిగతా 5వ పేజీలో)

అప్రమత్తంగా ఉండండి...

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయని, పక్కరాష్ట్రంలో వర్షాలు అధికంగా ఉన్నాయని, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంత కాలనీలు, గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కూడా శివారు కాలనీల్లో వరద నీరు రాకుండా చూసుకోవాలని మునిసిపల్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు చెరువులు, కుంటలు, వాగులు పొంగుతున్నందున రహదారులు, కల్వర్టులపైకి నీరు వచ్చే అవకాశం ఉందని, నీటమునిగే రహదారుల వద్ద రాకపోకలు నిలిపివేయాలని పోలీసులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల వారిని తరలించండి

సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి



వర్షాల నేపథ్యంలో ఖమ్మం కలెక్టర్‌తో పాటు మధిర మునిసపిల్ కమిషనర్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరద పరిస్థితిని ఫోన్‌లో సమీక్షించారు. భారీవర్షాలతో మధిర నియోజవర్గంలో వరదలు రావడంతో కరీంనగర్ పర్యటన ముగించుకుని భట్టి వెంటనే ఖమ్మం బయలుదేరారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధిర నియోజవర్గంలో వరదల సహాయక చర్యల పట్ల ఫోన్‌లో పలు సూచనలు చేశారు. వాగులు పొంగతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ రవాణమార్గాలు ఏర్పాటు చేయాలని లోతట్టు ప్రాంతాల వారిని క్యాంపులకు తరలించాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయండి..

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి



ఉమ్మడిజిల్లాలో కురుస్తున్న వర్షాలుపొంగుతున్న వాగులు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇరు జిల్లాల కలెక్టర్ల, అధికారులకు రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఇరు జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. కంట్రోల్ రూంలు ఏర్పాటుచేసి ఇబ్బందులు తెలుసుకోవాలని అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇంటినుంచి బయటకు రావద్దని సూచనలు చేయాలని కోరారు. అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకోవలని, వర్షాల వల్లకలిగే ఇబ్బందులును పరిష్కరించాలని సహయా చర్యలు వేగవంతం చేయాలన్నారు. వాగులు పొంగిన చోట రహదారులపై వెళ్లకుండా చూడాలని ఆదివారం కూడా భారీవర్సాలు కురిసే అవకాశం ఉన్నదున అధికారులంతా స్థానికంగా ఉండి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.



తాలిపేరుకు వరద తాకిడి

- 12 గేట్లు ఎత్తివేత
- 43,543 క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల, ఆగస్టు 31: ఛత్తీస్‌గఢ్‌తోపాటు, చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. వరద తాకిడి పెరగడంతో శనివారం ప్రాజెక్టు 12 గేట్లను ఎత్తి, 43వేల 543 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గత రెండు రోజులుగా చర్ల మండలంతోపాటు సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. పామేడులోని చింతవాగు, చర్ల మండలంలోని రోటింత వాగు, జెర్రిపోతుల, తరివాగు, ఈతవాగులు వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టులోకి గంట గంటకూ వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని అంచనా వేస్తున్న డీఈ తిరుపతి, ఏఈ శ్రీనివాసరావు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సెన్సార్ సిస్టం ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.. ప్రాజెక్టు వద్ద ప్రస్తుత నీటి మట్టం 72.64 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 28,290 క్యూసెక్కులుగా ఉంది..

పాలేరు నుంచి నీటి విడుదల తగ్గింపు

- ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆయకట్టులో తగ్గిన నీటి డిమాండ్

5

జల దిగ్బంధంలో ఎర్రుపాలెం

- వరదల్లో ఒకరి గల్లంతు
- ముగ్గురిని కాపాడిన స్థానికులు
- ఎగువన ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షాలతో పోటెత్తిన వరద
- పలు గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలు

ఎర్రుపాలెం, ఆగస్టు 31: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఎర్రుపాలెం మండలం... జోరువానలతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఖమ్మం జిల్లాలోని వైరా కట్టలేరు వరదతోపాటు సరిహద్దున ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో భారీగా వర్షాలు కురవడంతో వర్షపు నీరు పోటెత్తింది. దీంతో ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించడంతో జనం వరదలో చిక్కుకున్నారు. శనివారం రాత్రి 9 గంటల వరకు అత్యదికంగా 21.2 సెం.మీ. వర్షం నమోదు కావడంతో వాగులు, చెరువులను ముంచెత్తాయి. వరదల్లో చిక్కుకుని ఆరుగురు కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డారు. ఒకరు మాత్రం వరదలో గల్లంతుకావడం విషాదం నెలకొంది.


గల్లంతైన మలిశెట్టి సాంబశివరావు

ఎర్రుపాలెం మండలంలోని మొలుగుమాడులో చెరువు వరద పొంగడంతో ట్రాక్టర్‌పై వెళుతూ ట్రాక్టర్‌తోపాటు ముగ్గురు కొట్టుకుపోగా వారిని స్థానికులు రక్షించారు. ట్రాక్టర్ నీటి మునిగింది. ఇందులో మాచవరపు నర్సింహారావు, లక్ష్మిదంపతులు కాగా ఖరీదు నరేష్ డ్రైవర్ ఉన్నారు. కాగా ఇదే మండలంలోని మామునూరు గ్రామం వద్ద అలుగువాగు పొంగి ప్రవహించడంతో ఏపీ ఎన్టీఆర్ జిల్లా బెజ్జూరు గ్రామస్థులు వరదలో చిక్కుకున్నారు.


నీటమునిగిన పంటపొలాలు

భీమవరం నుంచి బెజ్జూరు మోటారుసైకిల్‌పై వాగుపై వెళుతుండగా వరదలో కొట్టుకుపోయారు. 100 మీటర్ల దూరంలో కట్టలేరు కెనాల్ కల్వర్టు దగ్గర చిక్కుకుని కల్వర్టును పట్టుకుని ఎక్కికూర్చున్నారు. వీరిని రక్షించడానికి మరో యువకుడు సాహసం చేసి అతడు కూడా చిక్కుకుపోయాడు. వరదనీరు చేరడంతో ముగ్గురు కల్వర్టుపై ప్రాణభయంతో ఉన్నారు వారిని గ్రామస్థులు తాడు సహాయంతో రక్షించారు.

అలాగే మండలంలోని భవానిపురం గ్రామానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు అనే యువకుడు వాగులో గల్లంతయ్యాడు, మలిశెట్టి సాంబశివరావు, కొండపల్లి రఘు ఇద్దరు స్నేహితులు. భీమవరం గ్రామానికి వచ్చి భీమవరం ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కలవాగు దాటుతూ సాంబశివరావు కొట్టుకుపోయాడు. యువకుడి కోసం గ్రామస్థులు గాలింపు చేపట్టారు. ఇక మండలంలో వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మొలుగుమాడులో ఇళ్లలోకి నీరు చేరింది. ఈ మండలంలో పలు గ్రామాలను వరద చుట్టుముట్టడంతో వాగులు పంటపొలాల్లో పరవళ్లు తొక్కుతున్నాయి.



కిన్నెరసాని జలాశయానికి వరద ప్రవాహం

మూడు గేట్లు ఎత్తి నీరు విడుదల

పాల్వంచ రూరల్, ఆగస్టు 31: కిన్నెరసాని జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. శనివారం జలాశయం నీటిమట్టం 405.06కి చేరింది. మహబూబాబాద్ జిల్లాలోని పాకాల కొత్తగూడెం, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీప్రాంతాల నుంచి 8వేల క్యూసెక్కుల వరదనీరు కిన్నెరసానికి చేరింది. ప్రాజెక్టు మూడుగేట్లు ఎత్తి 18వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కిన్నెరసాని పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు వ్యవసాయ మోటార్లను ఎత్తు ప్రాంతాలకు తరలించుకోవాలని ఆదేశించారు.

డీసీసీబీ చెల్లింపులపై విచారణ జరపండి...

టెస్కాబ్ ఎండీ, డైరెక్టర్లకు మంత్రి తుమ్మల ఆదేశం



ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జనరల్ మేనేజర్‌తో పాటు అధికారులు, సిబ్బందిపై పలు ఆరోపణలు, జరుగుతున్న ప్రచారాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే విచారణ జరిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టెస్కాబ్ ఎండీ గోపి, సహకారశాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌ని ఆదేశించారు. ఖమ్మం డీసీసీబీలో రూ.78 లక్షలు పాత బకాయిల పేరుతో సిబ్బందికి చెల్లింపులు చేశారని అలాగే సహకారసంఘాల సభ్యులకు బీమా నిమిత్తం ప్రభుత్వం రంగ బీమా కాకుండా ఎక్కువ ప్రీమియంతో సుమారు రూ.7 కోట్ల ఖర్చుతో బీమా కింద చెల్లించారని సహకార సంఘాల నుంచి, డీసీసీబీ నుంచి అనుమతి లేకుండా ఈ ప్రీమియం చెల్లించారని ఆరోపణలు రావడం జరిగింది. డీసీసీబీలో చోటుచేసుకున్న వ్యవహారాన్ని మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లడంతో నివేదిక ఇవ్వాలని టెస్కాబ్ ఎండీతోపాటు డైరెక్టర్‌ను మంత్రి తుమ్మల విచారణకు ఆదేశించారు.

బ్యాంకు లావాదేవీలపై డైరెక్టర్ల అభ్యంతరాలు

ఖమ్మం వ్యవసాయం : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పలు లావాదేవీలపై బ్యాంకు డైరెక్టర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఏకపక్షంగా చెల్లింపులు జరిగినట్లు ఆక్షేపించారు. ఖమ్మంలోని కేంద్ర సహకార బ్యాంకులో శనివారం ఏర్పాటు చేసిన ఆడిట్ సబ్‌కమిటీ, రిస్క్‌మేనజ్‌మెంట్ సబ్‌కమిటీ సమావేశాల్లో వారు మాట్లాడారు. డైరెక్టర్లకు తెలియకుండా బ్యాంకు ఉద్యోగులకు వేతన సవరణ బకాయిలు రూ.78 లక్షలు ఎలా క్లియర్ చేశారని ప్రశ్నించారు. వ్యవసాయ రుణాలు, రైతులకు ఇన్సూరెన్స్ సదుపాయంలో పాలకవర్గం, వ్యవసాయ సొసైటీలో ఆమోదం లేకుండా రూ.7 కోట్లు ఎలా చెల్లించారని, వివరణ కోరారు. అలాగే పాలకవర్గం లేకుండా తీసుకున్న పలు నిర్ణయాలపై సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుతో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి అబిద్ ఉర్ రహ్మాన్ శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపణలన్నీ నిరాధారమైనవని స్పష్టం చేశారు.

రాబడి ఉన్నా.. రాబట్టే ప్రయత్నమేదీ!?

నో టార్గెట్



- కేఎంసీ వార్షిక ఆదాయ లక్ష్యం రూ. 34 కోట్లు
- ఇప్పటి వరకు ఆస్తిపన్ను వసూళ్లు రూ. 13 కోట్లు
- ముందస్తు చెల్లింపులు రూ.8 కోట్లు
- ఆ తర్వాత ఆరు నెలల్లో రూ.5 కోట్లే
- డిమాండ్ నోటీసులు కూడా అందించలేని దుస్థితి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 31: నాలుగు రూపాయలుంటేనే నగర అభివృద్ధి జరుగుతుంది. అందుకు కావాల్సిన ఆదాయాన్ని రాబట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఖమ్మం నగర పాలక సంస్థ (కేఎంసీ) ఆదాయాన్ని సమకూర్చుకునే ప్రధాన వనరుల్లో ఒకటైన ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలో మాత్రం వెనకడుగు వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో పన్నుల రూపంలో చెల్లింపులకు సంబంధించిన ఆదాయాన్ని పెంచేందుకుగాను కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకుని డివిజన్ల వ్యాప్తంగా జల్లెడ పట్టించి అసెస్‌మెంట్లు రివిజన్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతవరకు బాగానే ఉన్నా ఆయా అసెస్‌మెంట్ల ద్వారా వచ్చే పన్నుల వసూళ్లలో మాత్రం జాప్యం జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లక్ష్యం చేరని వసూళ్లు...

ఖమ్మం నగరంలో పెరుగుతున్న నిర్మాణాలకు తగ్గట్టుగానే నగర పాలక సంస్థ ఆదాయం కూడా యేటికేడు పెరుగుతూ వస్తుంది. 2021-22, 2022-23లో రూ.26 కోట్లు వసూళ్లు కాగా, అది గతేడాదికి రూ.30 కోట్లకు చేరింది. కాగా ఈ ఏడాది దాని వార్షిక ఆదాయం రూ. 34 కోట్లు ఆదాయం రాబడి లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో మొదటి ఆరు నెలల కాలంలో సగం వరకు వసూళ్లు జరగాల్సి ఉండగా.. అది లక్ష్యం చేరనట్టుగా తెలుస్తోంది. ఈ వార్షిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మొత్తం రూ.13 కోట్లు మాత్రమే వసూళ్లు జరగ్గా.. రూ. 4కోట్లు లోటుగానే కానిపిస్తుంది. వసూలైన రూ.13 కోట్లలోనూ ఎర్లీబర్డ్ (ముందస్తు చెల్లింపులు)పథకం ద్వారానే రూ.8కోట్లు వసూళ్లు జరిగాయి. కాగా గడిచిన ఐదు నెలల కాలంలో రెవెన్యూ విభాగం ఆదాయ వసూళ్లు కేవలం రూ.5కోట్లు మాత్రంగానే కనిపిస్తోంది.

నేరుగా చరవాణికి సందేశాలు...

అయితే పన్నుల వసూళ్లకు సంబంధించి ఆయా నిర్మాణాలకు సంబంధించి ముందుగా డిమాండ్

(మిగతా 5వ పేజీలో)

మొలుగుమాడు వాగులో కొట్టుకుపోయిన ముగ్గురు

» తాడు సాయంతో కాపాడిన స్థానికులు

ఎర్రుపాలెం,ఆగస్టు31: ఎర్రుపాలెం మండలంలోని మొలుగుమాడు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వాగులో వరదకు కొట్టుకుపోయిన ఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మొలుగుమాడు గ్రామానికి చెందిన మాచవరపు నర్సింహారావు లక్ష్మి దంపతులు ఏపీలోని గంపలగూడెం బంధువులు దశదినకర్మకు వెళ్లి వస్తూ ఉధృతిగా ప్రవహిస్తున్న వాగు దాటి మొలుగుమాడు గ్రామంలోకి పోవడానికి వీలు లేక ఇనగాలి వద్ద ఆగి బంధువుల ట్రాక్టర్‌ను పిలిపించారు. ట్రాక్టర్‌పై వాగు దాటుతుండగా వరదకు ట్రాక్టర్ డ్రైవర్ ఖరీదు నరేష్‌తో సహా కొట్టుకుపోయారు. దాదాపుగా ఒక కిలోమీటరు దూరం వరదలో కొట్టుకుపోయి చెట్టును ఆసరాగా చేసుకని ఒక ఒడ్డుకు చేరారు ఆఒడ్డును దాదాపుగా 2గంటల పాటు కేకలు వేస్తూ ఉండిపోయారు. కేకలు గమనించిన ఐదుగురు స్థానికులు తాడుసాయంతో ముగ్గురిని బయటకు తీసుకువచ్చి ఇనగాలి గ్రామంలో వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిలో పునరావాసం కలిపించారు. కాగా ట్రాక్టర్ ఇంజన్ వాగులోనే మునిగిపోయి ఉంది.

వరదలో చిక్కుక్కున్న యువకులు

మండలంలోని మామునూరు గ్రామం వద్ద అలుగువాగు వరదలో ఏపీ, ఎన్టీఆర్ జిల్లా జుజ్జూరు గ్రామస్థులు కొట్టుకుపోయి వరదలో చిక్కుకున్నారు. భీమవరం గ్రామం నుంచి జుజ్జూరు మోటారు సైకిల్‌పై వెళుతూ వాగు దాటుతుండగా ఇద్దరు వరదలో కొట్టుకుపోయారు. సుమారు 100మీటర్ల దూరంలో కట్టలేరు కెనాల్‌కల్వర్టు దగ్గర చిక్కుకుని కల్వర్టుపై ఎక్కి కూర్చున్నారు. వారిని రక్షించడం కోసం వెళ్లిన యువకుడు కూడా అక్కడే చిక్కుకున్నాడు. చుట్టూ నీరు ఉండడంతో ఎటురాలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామస్థుల సహకారంతో రాత్రి 10గంటల తర్వాత వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

వాగులో గల్లంతు

భూనిపేరు గ్రామానికిచెందిన మలిశెట్టి సాంబశివరావు(20) అనే యువకుడు శనివారం వాగులో గల్లంతయ్యాడు. మలిశెట్టి సాంబశివరావు, కొండపల్లి రాము ఇద్దరు స్నేహితులు. భీమవరం గ్రామానికి వచ్చి భీమవరం ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కలవాగు దాటుతూ సాంబశివరావు కొట్టుకుపోయాడు. యువకుడి కోసం గ్రామస్తులు గాలింపు చేపట్టారు.

అత్యవసర సేవలకు హెల్ప్‌లైన్ సెంటర్

» ప్రకటించిన కేఎంసీ కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 31: రానున్న మూడు రోజుల పాటు అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసర సేవల కోసం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రకటించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ముందస్తు జాగ్రత్తలతో 7901298265, 9866492029 ఫోన్ నెంబర్లు కలిగిన కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలకు వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వదలని వర్షం..

» పొంగిప్రవహిస్తున్న వైరానది, కట్లేరు, పలు వాగులు, చెరువులు

» పట్టణ రహదారులన్నీ జలమయం

» మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



మధిర- అంబారుపేట రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మధిర చెరువు

మధిర, ఆగస్టు 31: మధిర నియోజకవర్గం వ్యాప్తంగా బంగాళాఖాతం ప్రభావంతో గతంలో ఎన్నడూ లేని విధంగా శుక్ర, శనివారాల్లో ఎడతెరిపిలేకుండా అతిభారీ వర్షం కురిసింది. అత్యధికంగా ఎర్రుపాలెం మండలంలో వర్షం కురవడంతో ఆమండలంలోని అన్ని చెరువులు, వాగులు పొంగుప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా బంద్ అయినాయి. మధిరలో గత రెండు రోజులుగా కుంభవృష్టి వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి, శనివారం పగలు 27.34సెం.మీ.(253.8ఏంఎం)లుగా నమోదైంది. అధికారిక లెక్కల ప్రకారం శుక్రవారం రాత్రి 9.26సెం.మీ. వర్షం కురవగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 18.08సెం.మీ. వర్షం నమోదైంది. ఇంత భారీ వర్షం ఈమధ్య కాలంలో ఎప్పుడూ కురవలేదు. ఎర్రుపాలెంలో శనివారం జిల్లాలోనే అత్యధికంగా 18.94 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మధిరలోని వైరానది, మధిర చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి.

మండలంలోని అన్ని చెరువులు పొంగి రహదారులపై వరద ప్రవహిస్తుండటంతో అన్ని గ్రామాలకు రాకపోకలు బంద్‌కావడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీగా వరదనీరు అడుగుల లోతులో ప్రవహించడంతో చెరువులను తలపించాయి. అండర్‌బ్రిడ్జి పూర్తిగా నిండిపోయింది. ఆప్రాంతంలోని ఇళ్లలోకి వరద నీరు వచ్చిచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లడకబజార్ మొత్తం జలమయంగా మారింది. మధిర చెరువు లోతట్టు ప్రాంతాలైన కేసీఆర్ కాలనీ, వరద రాఘవాపురం, ముస్లింకాలనీ, హనుమాన్ కాలనీల్లోని నివాసగృహాల్లోకి వరద నీరు వచ్చిచేరింది. వరద ముంపు ప్రాంతాలను తహసీల్దార్ రాంబాబు తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. వరద ఉధృతిని సమీక్షించి అవసరమైన సహాయకచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించడం జరుగుతుందని తెలిపారు.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా:

భారీ వర్షం కారణంగా మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెద్దగోపతి నుంచి మధిర 133కేవీ సబ్ స్టేషన్‌కు సరఫరా ఆగిపోవడంతో మూడు మండలాలకు విద్యుత్ సరఫరా బంద్ అయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడటంతో ఆశాఖ ఉద్యోగులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టారు. రాత్రికి కరెంట్‌ను అన్ని ప్రాంతాలకు పునరిద్దరించేందుకు తమ సిబ్బంది వర్షంలోసైతం ప్రయత్నిస్తున్నట్లు ఏడీఈ అనురాధ తెలిపారు. ఇలా ఉండగా 133కేవీ సబ్ స్టేషన్‌లోకి ఎప్పుడూ లేనిది వరద నీరు భారీగా రావడం కూడా ఇబ్బందిగా మారింది.



విజయవాడ రోడ్డులో ప్రవహిస్తున్న వరద



ముంపు బాధితులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

ముంచిన కొండవాగు

ఎర్రుపాలెం, ఆగస్టు31: రేమిడిచర్ల గ్రామంలో గత రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రేమిడిచర్ల కొండవాగును శనివారం ఎస్సీ కాలనీవాసుల ఇండ్లను ముంపునకు గురిచేసింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ మన్నె ఉషాశారద ఎస్ఐ వెంకటేష్ రేమిడిచర్లఎస్సీకాలనీ ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. 30 కుటుంబాలను కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. పాక్షికంగా వరద పట్టిన 50కుటుంబాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వానకు నానిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించాలని తెలిపారు. నీరు, భోజనం, దుప్పట్లు, ఫ్యాను, కరెంట్, మందుల సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ సెక్రెటరీకి సూచించారు. ఎంపీడీవో సురేందర్, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

కుండపోతగా వాన

బోనకల్, ఆగస్టు 31: కుండపోతగా కురుస్తున్న జోరు వర్షానికి శనివారం అన్ని గ్రామాలు జలమయంగా మారాయి. రహదారులు, పంటలు నీట మునిగాయి. గోవిందాపురం(ఎ) గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కారు వరద నీటిలో చిక్కుకుంది. ట్రాక్టర్ సహాయంతో కారును ఒడ్డుకు చేర్చారు. గ్రామం నుంచి ఆంధ్రా ప్రాంతానికి రాకపోకలు నిలిచి పోయాయి. చిన్నబీరవల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. చిరునోముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి.



కారును తీసుకొస్తున్న ట్రాక్టర్

పొంగిన వాగులు.. పొర్లిన వరద

» రహదారులపై చేరిన నీరు

కల్లూరు, ఆగస్టు 31 రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షంతో కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వాగులు వంకలు పొంగి రహదారులపై ప్రవహిస్తున్నాయి. దీంతో శనివారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు మండల స్థాయి అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో వరద ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. కల్లూరు టు మధిర రహదారిపై పోచారం వద్ద పెద్దచెరువు అలుగు పొంగి ప్రవహిస్తోంది. పోచారం వద్ద రహదారిపై జరుమెలైన, తాళ్లూరు టు వెంకటాపురం వద్ద ఊరచెరువు అలుగు వరద నీరు ఆయా గ్రామాల మధ్యన ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. తాళ్లూరు, కర్నవల్లి గ్రామాల మధ్యన గల వాగు నీరు రహదారిపై ప్రవహించటంతో ఆయా గ్రామాల వద్ద ఇరువైపు వరద ప్రమాదం ఉన్న అలుగు ప్రదేశాల్లో రహదారులపై అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి రాక పోకలను నిలిపి వేసినట్టు కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ తెలిపారు.

మధిర నుంచి కల్లూరుకు బస్సుల రాక పోకలు నిలిపివేశారు. పోచవరం, తాళ్లూరు గ్రామాల వరద ప్రదేశాలను తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ షాకీర్‌లతో పాటుగా నీటిపారుదల తదితర శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సదరు వరద ప్రదేశాలకు చేరుకొని గస్తీ ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసే క్రమంలో శనివారం సాయంత్రం కలెక్టర్ కల్లూరు డివిజన్ అధికారులతో సమీక్షించారని ఆర్డీవో రాజేంద్రగౌడ్ తెలిపారు.



వరద ఉధృతిని పర్యవేక్షిస్తున్న అధికారులు

వరదలో ఇద్దరి గల్లంతు

మధిరరూరల్, ఆగస్టు 31: మధిర మండలంలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి వరదలో చిక్కుకొని వంగీడు, దెందుకూరు గ్రామాల్లో ఇద్దరు గల్లంతయ్యారు. దెందుకూరు గ్రామంలో నెన్నెబోయిన పద్మావతి(36)అనే మహిళ శనివారం ఉదయం పనిగంటల సమయంలో గేదెలను తోలుకొని గ్రామసమీపంలోని రైల్వే ట్రాక్ వైపు వెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం భారీ వర్షాలు కురిసి పెద్ద ఎత్తున వరదలు రావడంతో గేదెలను తోలుకొని వెళ్లిన ఈ మహిళ వరద ఉధృతిలో చిక్కుకొని గల్లంతైనట్లు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు.

వారి బంధువులు, గ్రామస్తులు ఒక టీంగా ఏర్పడి వెతికినా ఆచూకీ లభించలేదు. వంగీడు గ్రామంలోనూ మరో వ్యక్తి వరదలో చిక్కుకున్నాడు. తోటపల్లి చెందిన వెంకటేశ్వర్లు వంగీడు చెరువులో చేపలవల సరిచేసేందుకు వెళ్లాడు. వల సరిచేసి తిరిగి వస్తుండగా వంగీడు చెరువు అలుగు వద్ద కొట్టుకుపోయాడు. ఇతడు వరదలో పొలాల వద్ద ఒక బండరాయిని పట్టుకొని కన్పిస్తున్నట్లుగా స్థానికులు తెలిపారు. ఖమ్మం ఆర్డీవో గణేష్, మధిర సీఐ మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి పలువురు గజ ఈతగాళ్లతో కలిసి వంగీడు చెరువు ప్రాంతం వద్దకు చేరుకున్నారు.

వరదలో చిక్కుకున్న ఇతడిని రక్షించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే భారీ వర్షం మళ్లీ మొదలు కావడం, చిమ్మచీకటిగా ఉండటంతో అతడిని రక్షించేందుకు రాత్రి సమయంలో వీలుపడలేదు.

దశాబ్దంన్నర కాలంలో ఇదే కనిష్ఠం

భద్రాచలం, ఆగస్టు 31: ఆగస్టు నెల వచ్చిందంటే చాలు వరదలు ముంచెత్తుతాయి. గోదావరి భద్రాచలం వద్ద తుది ప్రమాద హెచ్చరిక 53 అడుగులు దాటి ప్రవహిస్తుందంటే ఏజెన్సీ ప్రజానీకం ఆందోళన చెందుతారు. అలాంటి పరిస్థితుల్లో ఈసారి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆగస్టు నెలలో సాదాసీదాగా ఉంది. గత దశాబ్దంన్నర కాలంలో ఇంత కనిష్టంగా నీటిమట్టం ఎప్పుడూ లేదు. ఈ ఏడాది భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆగస్టు నెలలో అత్యధికంగా27వ తేదీన 28.6 అడుగులతో ఉండటం గమనార్హం. గత ఏడాది ఇదే నెలలో భద్రాచలం వద్ద గోదావరి ఆగస్టు 22వ తేదీన 32.7 అడుగుల నీటిమట్టం నమోదైంది. అదే 2023 ఆగస్టులో అత్యధిక నీటిమట్టంగా నిలిచింది. 2024లో ఆగస్టు ఒకటో తేదీన 45.1 అడుగు నీటిమట్టం గోదావరి ఉన్నప్పటికీ జూలై నెలలో వచ్చిన వరదల కొనసాగింపే తప్ప ఆగస్టు నెలలో పడిన వర్షాలతో భారీగా నీటిమట్టం పెరిగిన దాఖలాలు లేవు.

మీ ఊర్లో జ్వరాలు ఉన్నాయా?

» ఆశా కార్యకర్తలు, డాక్టర్లు వస్తున్నారా...:?

» రోగులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

» మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 31:'ఏమ్మా...!మీ ఊర్లో జ్వరాలు ఉన్నాయా... ఏ ఊరు మీది.. ఆశా కార్యకర్తలు వస్తున్నారా ఇళ్లకి.. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా?' అంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రోగులను, మహిళలను ఆరా తీశారు. శనివారం ఆయన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాజువాలిటి, ఫార్మసీ, వార్డులు పరిశీలించారు. గర్భిణులు, వైద్య పరీక్షలకు వచ్చిన గర్భవతులు, రోగుల సహాయకులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల నమోదుకు కావాల్సిన కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఉన్నాయా లేవా అని అడిగారు. ఆ తర్వాత డెలివరీ రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఈడీడీల వివరాలు అడిగి, రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేస్తున్నది, లేనిది తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు వైద్యులతో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో తరచుగా పీసీవోడీకి సంబంధించిన వ్యాధులు తలెత్తడానికి గల కారణాలేంటని ప్రశ్నించారు. దీనికి వైద్యులు పిల్లలో శారీరక శ్రమ లేకపోవడం, చిన్నారులకు ఆటలు, వ్యాయామం లాంటివి గతంలో మాదిరిగా లేకపోవడంతో ఇలాంటి వ్యాధులు బారిన పడుతున్నారంటూ చెప్పడంతో.. ఏమ్మా మీ దగ్గరికే తల్లులు వస్తున్నారు.. మహిళలు వస్తున్నారు. వాళ్లకి ఇలా కౌన్సెలింగ్ ఇవ్వండి.. పిల్లలను ఆటలాడే విధంగా చూడాలని శారీరక శ్రమ పడేలా చేయాలని వివరించాలంటూ ఉద్బోధించారు. ఈ సందర్భంగా ఓ చిన్నారిని కలెక్టర్ ఎత్తుకుని మురిసిపోయారు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో డెలివరీలు పెంచాలని, గర్భిణులకు రెగ్యులర్ చెకప్ అయ్యేలా చూడాలని తెలిపారు.స్కానింగ్ కేంద్రాలను పరిశీలించి, ఎంత మంది టెక్నీషియన్లు ఉన్నది, ఎన్ని పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. రేడియాలజిస్టులు లేకపోవడంతో ఇబ్బంది ఉంటోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఆసుపత్రిలో సమస్యలు, కావాల్సిన సౌకర్యాలకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటూ వచ్చే వారితో ప్రేమపూర్వకంగా మెలగాలని, వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జర్వాలతో బాధపడేవారికి ఒక ప్రత్యేక వార్డు ఏర్పాటుచేసి, చికిత్స అందించాలన్నారు. వార్డులో 24 గంటలు వైద్యాధికారి అందుబాటులో ఉండి, ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు సాధారణంగా వైద్యపరీక్షలకు వచ్చిన వారికి ఒత్తిడిని జయించే శక్తి కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడిటేషన్ రూమ్‌ను కలెక్టర్ సందర్శించారు. కాన్పుల వార్డు, ఐసీయూ, ఇన్ బోర్న్ యూనిట్, నవజాత శిశు సంరక్షణ కేంద్రం, అమృతం తల్లిపాల కేంద్రం, తల్లిపాలను సేకరించి, నిల్వ ఉంచే కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్.రాంబాబు, వినాయక్ రాథోడ్ వైద్యాధికారులు తదితరులున్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్ర 'స్టార్ ప్లేయర్స్'గా జిల్లా టీటీ క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 31: తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రతి సంవత్సరం ప్రకటించే 'స్టార్ ప్లేయర్స్' జాబితాలో జిల్లా క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఆగస్టు 30, 31 తేదీల్లో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ చాంపియన్ షిప్‌లో భాగంగా టేబుల్ టెన్నిస్ ఫర్ లైఫ్ అసోసియేషన్ సౌజన్యంతో రాష్ట్ర టీటీ సంఘం తెలంగాణ లో రాబోయే తరాలకు దీటుగా నిలిచే సత్తా ఉన్న క్రీడాకారులను ఈ అత్యున్నత పురస్కారాలకు ఎంపిక చేశారు. వారిలో జిల్లా నుంచి 11మంది ఎంపికవడం విశేషం. అండర్-11 విభాగంలో షేక్ ఫైజల్, అన్నెం ఉజ్వల్, బొంతు సాయిశివాని, కోటగిరి హితేష్, ఈలప్రోలు హరి, అండర్- 13 విభాగంలో గౌరిశెట్టి చార్విక్, ఆనస్, బిగినర్స్ విభాగం నుంచి అనుముల శ్రీయాన్, బాలసాని హారిక శ్రీలక్ష్మి, బాలసాని తన్మయిశ్రీ ఎంపికయ్యారు. ప్రతిభా అవార్డులను రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రకాశ్‌రాజ్, టేబుల్ టెన్నిస్ ఫర్ లైఫ్ అసోసియేషన్ సభ్యులు దీపేశ్‌సింగ్, నరేష్‌రెడ్డి, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు బాలసాని విజయ్ అందించారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం అత్యుత్తమ ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన క్రీడాకారులు పరిటాల జ్వలిత్, పిట్టల మోహిత్‌కృష్ణ, అన్నెం యశ్వంత్, ఈలప్రోలు తరుణ్, జంగాల గౌరీ అర్జున్ పతకాలు లభించాయి. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ అవార్డులు, పతకాలు సాధించిన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, టీటీ సంఘం కార్యదర్శి సాంబమూర్తి తదితరులు అభినందించారు.



ప్రతిభ అవార్డులు అందుకున్న జిల్లా క్రీడాకారులు

ఉత్తీర్ణత సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్: పీవో

మణుగూరు, ఆగస్టు 31: డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉజ్వల భవిష్యతు బాటలో పయనించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. శనివారం మణుగూరులోని గిరిజన గురుకుల సంక్షేమ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గురుకుల కళాశాలలో గదులు, భోజన వసతిని పరిశీలించి సమస్యలపై విద్యార్థులను ప్రశ్నించారు. డిగ్రీ సెమిస్టర్ చదివే వారు సమకాలిక విషయాలపై కూడా దృష్టి సారించి పరిజ్ఞానం పొందాలన్నారు. అనంతరం రీజినల్ కో ఆర్డినేటర్ నాగార్జున మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న అకోజ్, సిబ్బంది బి.రవి, కృష్ణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్తే ప్రాణాలు తీశారు

» వైద్యులే కారణమని తేల్చిన నిజ నిర్ధారణ కమిటీ

» ముగ్గురు వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

» విలేకరుల సమావేశంలో మృతుని తండ్రి, దళిత సంఘాల నాయకుల డిమాండ్



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మృతుని తండ్రి మంద వెంకటేశ్వర్లు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 31: వైద్యం కోసం వెళ్తే... నిర్లక్ష్యంగా వ్యవహరించి తమ కుమారుడి ప్రాణాలు తీశారని.. న్యాయం చేయాలని గతంలో భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా నిజ నిర్ధారణ కమిటీ వేసి విచారణ చేపట్టి... మృతికి గల కారణం ముగ్గురు వైద్యులేనని తెలుస్తూ నివేదికను ఇచ్చారని మృతుని తండ్రి మంద వెంకటేశ్వర్లు, దళిత సంఘాల నాయకులు వివరాలు వెల్లడించారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా... చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ పంచాయతీలోని రాంనగర్ ఏరియాకు చెందిన మంద వెంకటేశ్వర్లు, తన కుమారుడైన మృతుడు 25 సంవత్సరాల వయస్సు కలిగిన మందా రాకేష్ అనారోగ్యంతో గత ఏడాది 2023 సెప్టెంబరు 7న కొత్తగూడెంలోని ఓ క్రిటికల్ కేర్ హాస్పిటల్‌కు చికిత్స కోసం వెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించారు. వెంకటేశ్వర్లు ఆరోగ్యం కుదుట పడగా... కుమారుడు రాకేష్ కోలుకోకపోవడంతో భయాందోళన చెందారు. మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌కు తీసుకెళ్తామని వైద్యులతో కుటుంబ సభ్యులు తెలిపారు. వారు నిరాకరించి మెరుగైన వైద్యం ఇక్కడే ఆస్పత్రిలోనే అందిస్తామని నమ్మించారని ఆరోపించారు. నిర్లక్ష్యంగా ఉంటూ సరైన వైద్యం అందించకపోవడంతో మందా రాకేష్ మృతి చెందాడని నిరసనలు తెలిపారు. ఈ సంఘటనపై న్యాయం చేయాలంటూ కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు మృతిని తండ్రి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు ఆస్పత్రి వైద్యులపై అప్పుడే కేసు నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ విచారణలో నిర్లక్ష్య వైద్యంతోనే మృతి చెందినట్టు తెలుపుతూ నివేదికను మృతిని తండ్రికి అందజేశారు. నా కుటుంబం మాదిరిగానే మరెవరూ ఇలాంటి సమస్యలను పుత్ర శోకం ఎదుర్కోవద్దు అంటూ మృతుడి తండ్రి కోరుతున్నాడు. సంబంధిత ఆస్పత్రిని తక్షణమే సీజ్ చేసి, వైద్యులపై హత్యా నేరం క్రింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో చర్మ కార్మికుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కూసపాటి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి కోట శివశంకర్, దళిత సంఘ నాయకులు మందా హనుమంత్, భూపతి అశోక్, నక్కా సృజన పాల్గొన్నారు.

చిరు వ్యాపారులు లైసెన్స్‌లు తీసుకొని వ్యాపారాలు చేపట్టాలి

ఖమ్మంలో ఉమ్మడి జిల్లా లైసెన్స్ మేళా

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 31: వ్యాపారం చిన్నదైనా, పెద్దదైనా తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా వ్యాపారుల కోసం లైసెన్స్ మేళా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిన్న వ్యాపారులు సైతం లైసెన్స్‌లు తీసుకోవటం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు అందించే ముద్ర ఇతర రుణాలకు అర్హత ఉంటుందని, ప్రమాదాలు జరిగితే భీమా వర్తింపు జరుగుతుందని తెలిపారు. లైసెన్స్‌లు లేని వ్యాపారాలకు జరిమాన విధిస్తామని ప్రకటించారు. లైసెన్స్ మేళాలో ఉమ్మడి జిల్లాలో 45 నూతన లైసెన్స్‌లు మంజూరు చేశామని తెలిపారు. కాగా నూతనంగా మంజూరు జరిగిన లైసెన్స్‌లను ఖమ్మం మేయర్ పునకొల్లు నీరజ వ్యాపారులకు అందజేశారు.



దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్‌గా సీతారాములు



నేలకొండపల్లి, ఆగస్టు 31: నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా మండల పరిధిలోని కొత్తకొత్తూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు వెన్నపూసల సీతారాములును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీతారాములుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడిగా పేరుంది. చైర్మన్‌గా వెన్నపూసల సీతారాములు, వైస్-చైర్మన్‌గా కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన కొండపర్తి సురేష్, సభ్యులుగా బోదులబండకు చెందిన మీసా నాగేశ్వరరావు, చెర్వుమాధారానికి చెందిన సూరేపల్లి రవి, కొంగరకు చెందిన చిట్టూరి అచ్చయ్య, మంగాపురంతండాకు చెందిన భూక్యా సేత్యానాయక్, కూసుమంచి మండలం, జీళ్ళచెర్వుకు చెందిన మొక్కా ఉపేందర్, చంద్యాతండాకు చెందిన బానోతు బొంగానాయక్, నాయకన్‌గూడెంకు చెందిన కంచర్ల సుధీర్‌రెడ్డి, గట్టుసింగారానికి చెందిన చాట్ల సత్యనారాయణ, పెరికసింగారానికి చెందిన తిప్పని సరోజిని, కోక్యాతండాకు చెందిన బానోతు సైదానాయక్, ట్రేడర్ల నుంచి ఓరుగంటి కిరణ్‌కుమార్, బోనగిరి సాయిరాజేష్, రాజేశ్వరపురం సహకార సంఘం అధ్యక్షుడు, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడీఏ,కూసుమంచి, నేలకొండపల్లి స్పెషల్ ఆఫీసర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కమిటీ కాలపరిమితి రెండేళ్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శ్రీజ



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 31: ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పి. శ్రీజ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె ములుగు జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తుంది. ఆమెను ఖమ్మం జిల్లాకు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె జాతీయ స్థాయిలో 20వ ర్యాంకు సాధించింది. సోమవారం ఆమె జిల్లాకు రానున్నట్లు తెలిసింది.

రామాలయంలో భాద్రపద మాసోత్సవాలివే..

భద్రాచలం, ఆగస్టు 31: భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహించే భాద్రపద మాసోత్సవాల వివరాలను దేవస్థానం అధికారులు వెల్లడించారు. సెప్టెంబరు 7న సుదర్శన హోమం, 13, 20 తేదీల్లో సంధ్యా హారతి, 26న పునర్వసు సందర్భంగా ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అలాగే 27న పట్టాభిషేకం, 28న లక్ష కుంకుమార్చన, కాగా సెప్టెంబరు 16న గణపతి నవరాత్రుల సందర్భంగా నిమజ్జనానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల రాకను బట్టి తగిన ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు.

కృష్ణా బేసిన్‌లో హై అలెర్ట్

- శ్రీశైలానికి 3.85 లక్షల క్యూసెక్కుల వరద
- శనివారం రాత్రి 5లక్షల క్యూసెక్కుల విడుదల
- నాగార్జున సాగర్‌కు పోటెత్తుతున్న కృష్ణమ్మ
- నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు సెలవులు రద్దు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీశైలానికి ప్రమాదకర స్థాయిలో వరద వస్తోంది. శనివారం రాత్రి 9:53 గంటల సమయంలో అత్యధికంగా 3.85లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమై 10 గేట్లను ఎత్తడం ద్వారా ఏకంగా 5.01 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 213.88 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. మరింత వరద వచ్చే అవకాశాలు ఉన్నాయన్న అంచనాలతో రిజర్వాయర్‌ను సాధ్యమైనంత మేర ఖాళీ చేసే పనిలో అధికారులు ఉన్నారు. రిజర్వాయర్ ఖాళీగా ఉంటే.. అత్యవసర పరిస్థితిలో నిర్వహణ సులభమవుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు.. రాష్ట్రంలోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటి పారుదల శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టుల వద్ద శనివారం హైఅలెర్ట్ ప్రకటించింది. ఇటీవలి వరదలకు ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిన ఘటనను దృష్టిలో పెట్టుకొని.. అధికారులు, ఇంజనీర్ల సెలవులను రద్దు చేసింది. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్‌ను విడిచి పోవద్దని, ఇంజనీర్లందరూ అందుబాటులో ఉండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. కాగా, ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల గేట్లన్నీ ఎత్తడంతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి 4,74,359 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఈ సీజన్‌లోనే ఇదే అత్యధికం కావడం గమనార్హం. దీంతో ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 4,12,078 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుదుత్పత్తితో కలిపి మొత్తం 4,53,700 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. మూసీ ప్రాజెక్టుకు శనివారం రాత్రి 5,500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కావడంతో నాలుగు గేట్లను ఎత్తి 3,500 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇక..గోదావరి బేసిన్‌లో ఎగువన ఉన్న ప్రాజెక్టులకు వరద నిరాశజనకంగానే ఉంది. శ్రీరామ్‌సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద పెరిగింది. ఎగువ గోదావరిపై మహారాష్ట్రలోని పైఠన్ వద్ద ఉన్న జైక్వాడి ప్రాజెక్టు నిండితేనే దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. 13,318 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాలుగు గేట్లు ఎత్తి 27,296 క్యూసెక్కులను గోదావరిలోకి వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద కొనసాగుతోంది. బ్యారేజీలోకి 1.40లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు.

వర్షాల ఎఫెక్ట్.. నేడు రేపు 25 రైళ్లు రద్దు: రైల్వే

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలపై భారీ వర్షాల ప్రభావం పడింది. దీంతో ఆది, సోమవారాల్లో వివిధ మార్గాల్లో నడవాల్సిన 25 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, కుండపోత వర్షాల కారణంగా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పలు రైళ్లను రద్దు, కొన్ని రైళ్ల దారి మళ్లింపు సమాచారాన్ని ప్రయాణికులకు తెలియజేయడానికి దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన్ నెంబర్లను ప్రకటించింది. హైదరాబాద్-27781500, సికింద్రాబాద్-27786140, 27786170, కాజీపేట- 27782660, 8702576430, వరంగల్- 27782751, ఖమ్మం- 27782985, 08742-224541, 7815955306, విజయవాడ -7569305697, రాజమండ్రి- 0883-2420541, 0883-2420543



గార్ల సమీపంలోని రాంపురం చెక్‌డ్యాంపై నుంచి పొంగిపొర్లుతున్న పాకాలవాగు



ఎర్రుపాలెంలో నీటి మునిగిన పత్తి చేను

వణికించిన చినుకు

(మొదటిపేజీ తరువాయి)

పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా చాలాచోట్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి రోడ్లు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా పాత ఇళ్లు కూలిపోయాయి. వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఒకరు గాయపడ్డారు. మరొకరు వరద నీటిలో గల్లంతయ్యారు! ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో 21.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మరికల్‌లో 13.8 సెం.మీ., యాదాద్రి జిల్లా అడ్డగూడూరులో 10.3 సెం.మీ., వరంగల్ జిల్లా దుగ్గొండిలో 9.48 సెం.మీ., కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో 9.37 సెం.మీ., నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో 8.5 సెం.మీ., ఆసిఫాబాద్ జిల్లా రెబ్బనలో 7.8 సెం.మీ., వికారాబాద్ జిల్లా చౌదాపూర్‌లో 7 సెం.మీ వర్షపాతం నమోదైంది. సింగరేణిలో భారీ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. హైదరాబాద్‌లో రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. వర్షాల కారణంగా హైదరాబాద్ పరిధిలోని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఇతర జిల్లాల్లో పరిస్థితులను బట్టి డీఈవోలు సెలవు ప్రకటించవచ్చునని ఆదేశాలు వెళ్లాయి.

ఖమ్మంలో భారీ వర్షం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షం కురిసింది. వందల ఎకరాల్లో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షాలతో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలాన్ని వరద చుట్టుముట్టింది. మండలంలోని మొలుగుమాడు వద్ద ఏరు పొంగిపొర్లుతోంది. అక్కడ వాగు దాటే ప్రయత్నంలో వరద ఉధృతికి ఓ ట్రాక్టర్ కొట్టుకుపోయింది. ట్రాక్టర్ నుంచి పడిపోయి.. నీళ్లలో చిక్కుకున్న ముగ్గురిని స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీశారు. మండలంలోని నర్సింహాపురం వద్ద వాగు పొంగడంతో బైక్‌పై వెళుతున్న యువకుడు వాగులో జారిపడ్డాడు. అతడిని గ్రామస్థులు రక్షించారు. మధిర మండలం వంగవీడు చెరువు ప్రాంతంలో తోటపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేపల చెరువులో వల సరిచేసేందుకు వెళ్లి వరదలో చిక్కుకొని సమీపంలోని ఓ చెట్టెక్కాడు. ఇదే మండలంలోని క్రిష్ణాపురం పాలవాగు సమీపంలోని రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు నీటిలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. మామునూరు వద్ద వాగును దాటే ప్రయత్నంలో ముగ్గురు చిక్కుకుపోయారు. కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో మద్దెలచెరువు వద్ద భారీ వృక్షం నేలకూలడంతో బిచ్కుంద, పిట్లం, బాన్సువాడకు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్ జిల్లాలో దేవరాంపల్లి, తాళ్లపల్లి, ఫతేపూర్, వెంకటాపూర్ సహా తదితర చోట్ల వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంతంలో జనసంచారాన్ని కట్టడి చేసేందుకు పోలీసు సిబ్బందిని మోహరించారు. బషీరాబాద్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వర్షపునీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వికారాబాద్ మండలం రాళ్లచిట్టంపల్లి గ్రామంలో పత్తి, కంది చేలల్లో వర్షపునీరు నిలిచింది. నల్లగొండ నేరేడుచెర్ల ప్రభుత్వ కాలేజీలోకి, చండూరులోని జెడ్పీ హైస్కూల్‌ను వరద నీరు చుట్టుముట్టింది. మహబూబాబాద్ జిల్లా గార్లలో పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మద్దివంచ, రాంపురం సహా 11 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూరు మండలం మల్లేపల్లి వాగులో ఓ కారు కొట్టుకుపోయింది. కారును, వాహనంలోని వారిని స్థానికులు బయటకు తీశారు.

ముగ్గురి మృతి



భూపాలపల్లి జిల్లా గోపాల్‌పూర్‌లో కుప్పకూలిన ఇల్లు

కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో పిడుగుపడి విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. ఆ వైర్లను స్వాతి (18) అనే యువతి తాకడంతో విద్యుదాఘాతంతో మృతిచెందింది. జిల్లాలోని బొప్పన్‌పల్లిలో పిడుగుపాటుకు కేమ్యా అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా నక్కలవాగులో భవానీపురానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు అనే యువకుడు వాగులో పడి గల్లంతయ్యాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో పిడుగుపాటుకు మహేశ్ (30) అనే పశువుల కాపరి ప్రాణాలు కోల్పోయాడు. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాములలో ఇంటి పైకప్పు కూలి వడ్డె చంద్రయ్య (55) అనే వ్యక్తి మృతిచెందాడు.



నల్లగొండ పట్టణంలో జలమయమైన అర్బన్ హెల్త్‌సెంటర్

కోదాడ జలమయం

శనివారం రాత్రి 8గంటల నుంచి భారీ వర్షం పడటంతో సూర్యాపేట జిల్లా కోదాడ జలమయమైంది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు.. ఖమ్మం నుంచి కోదాడ, సూర్యాపేట నుంచి కోదాడకు వచ్చే వాహనాలు భారీ వరదకు రోడ్లపై ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనాలు ముందుకు కదలక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పట్టణంలోని శ్రీరంగాపురం వద్ద డివైడర్ నుంచి వరద పోటెత్తుతోంది. కాలనీల్లోని ఇళ్లలోకి భారీగా వరద చేరింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పట్టణమంతా అంధకారం అలుముకుంది. ఇళ్లలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావొద్దంటూ పోలీసులు సూచించారు.

అలర్ట్.. అలర్ట్

రాష్ట్రానికి హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆది, సోమవారాల్లో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి , మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. సెప్టెంబరు 3 వరకు రాష్ట్రానికి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం శనివారం నాటికి వాయుగుండంగా మారి వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతం అయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. కాగా మరో 2-3 రోజుల పాటు వర్షాలు పడితే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

బొగత.. నిలిపివేత

ములుగు జిల్లాలోని బొగత, లక్నవరం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని.. ఈ రెండు చోట్ల, అలాగే రామప్ప సందర్శనను కూడా 48గంటలపాటు నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంతవరకు పర్యాటకులు రావొద్దని. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. సమక్క-సారలమ్మ దర్శనం కోసం మేడారం వచ్చే భక్తులు కూడా తమ ప్రయాణాన్ని ఒకరోజు వాయిదా వేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పెట్టే వరకూ బొగత సందర్శనను నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో రాజమౌళి చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కొమ్మలవంచ అటవీ ప్రాంతంలో భీమునిపాదం జలపాతం సందర్శకులను కనువిందు చేస్తోంది.

క్రైం సమాచారం

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

జూలూరుపాడు, ఆగస్టు 31: పురుగుమందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మండలంలోని పడమట నర్సాపురం గ్రామానికి చెందిన యువకుడు కిన్నెర గోపయ్య (35) శుక్రవారం రాత్రి మృతిచెందాడు. టేకులపల్లి మండలం వేపలగడ్డ గ్రామానికి చెందిన గోపయ్య మామ నర్సింహులు సింగరేణి సంస్థలో కార్మికుడిగా పనిచేస్తు మూడేళ్ల క్రితం పదవీ విరమణ పొందాడు. నర్సింహులు పదవీ విరమణ చేసిన తర్వాత మనవరాలు సాహిత్యకు రూ. 2లక్షలు ఇస్తానని గతంలో అల్లుడు ,కూతురికి చెప్పాడు. దీంతో గత కొన్ని నెలల నుంచి ఆ డబ్బులు తీసుకురావాలని గోపయ్య తన భార్య రమాదేవితో పలుసార్లు వివాదానికి దిగాడు. డబ్బులు ఇప్పుడే తెసే నీవు మద్యం తాగి ఖర్చు చేస్తావని, కూతురు సాహిత్య వివాహానికి వాడుకుందామని ఆమె భర్తతో చెప్పింది. ఈ క్రమంలో ఆ డబ్బుల విషయమై ఆగస్టు 30వ తేదీన భార్య, భర్తల మధ్య మరోసారి వివాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురై బయటకు వెళ్లి గోపయ్య పురుగుల మందు సేవించాడు.

జ్వరంతో గృహిణి కన్నుమూత

మణుగూరు, ఆగస్టు 31: మండలంలోని పగిడేరు గ్రామంలో నివాసముండే గనిబోయిన లక్ష్మి (24) జ్వరంతో తీవ్ర అస్వస్థతకులోనై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. నాలుగు రోజులుగా వైరల్ ఫీవర్‌తో లక్ష్మి ఇబ్బంది పడుతుండగా భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త పేరు రాజేష్, ఏడేళ్ల బాబు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు31: హడావుడిగా బస్సు ఎక్కుతున్న మహిళ హ్యాండ్ బ్యాగ్ నుంచి ఇద్దరు దొంగలు సెల్‌ఫోన్ చోరీ చేసిన సంఘటన సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన షబన్నం అనే మహిళ శనివారం ఖమ్మం ఫ్లాట్‌ఫారం వద్ద బస్సు ఎక్కుతుండగా లోపలి నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు హడావుడిగా ఉన్న మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.10వేల విలువైన మొబైల్‌ను చోరీ చేశారు. సీటులో కూర్చున్న సదరు మహిళ బ్యాగ్‌ను చూడగా అప్పటికే మొబైల్ చోరీకి గురైంది. వేరే ఫోన్ నుంచి కాల్ చేయగా స్విచ్ ఆఫ్ అని వస్తుండగా సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక బలవన్మరణం

పాల్వంచ, ఆగస్టు 31: ఆర్థిక ఇబ్బందులు తాళలేక క్రిమి సంహారక మందు సేవించి వ్యక్తి ఆతహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పట్టణ పరిధిలోని పాత పాల్వంచలో నివాసముంటున్న కొల్లి నరేంద్ర(34) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఆర్థికంగా కృంగిపోయాడు.

శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి బిక్కుతండా గ్రామశివారులో క్రిమి సంహాకర మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్నేహితులకు, కుటుంబ సభ్యులు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న వారు అతనిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు.

చికిత్స పొందుతూ సీపీఎం నాయకుడు...

ఖమ్మం రూరల్, ఆగస్టు 31: డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు, సీపీఎం మండల కమిటీ సభ్యుడు మండల పరిధిలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన తాటి వెంకటేశ్వర్లు (40) ఆర్థిక ఇబ్బందులు తాళ్లలేక శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు శనివారం మృతిచెందాడు.

పాల్వంచలో గంజాయి పట్టివేత?

పాల్వంచ, ఆగస్టు 31: జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం పాల్వంచలో గంజాయి పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పాల్వంచ రాహుల్ గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో గంజాయి ఉందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నాలుగు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అదే క్రమంలో గంజాయిని కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వాన హోరు.. వరద జోరు..

(3వ పేజీ తరువాయి)

తదితర ఏర్లు పొంగి ప్రవహిస్తున్నాయి. కొణిజర్ల మండలంలోని మల్లుపల్లి, లాలాపురం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. తద్వారా ఏన్కూరు, కొణిజర్ల మండలాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వైరా రిజర్వాయర్‌కు భారీగా వరద చేరుతోంది. భారీవర్షాలు పడడంతో పలుచోట్ల పొలాలు నీటమునుగుతున్నాయి. జిల్లాలో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు వేల ఎకరాలల్లో నీటమునిగాయి. భారీ వర్షాలతో జిల్లాలో రెడ్అలర్ట్ ప్రకటించినిట్టు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వరద సహాయం కోసం ఖమ్మంలో కంట్రోల్‌రూం ఏర్పాటుచేశామన్నారు. అత్యవసర సమయంలో 1077 టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటు 9063211298కు ఫోన్ చేయాలని తెలిపారు. అధికారులంతా తమ పని ప్రాంతాల్లోనే ఉండాలని ఆదేశించారు.

భద్రాద్రి జిల్లాలోనూ..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. అత్యధికంగా భద్రాచలం ప్రాంతంలో 3.2సెంటీమీటర్ల వర్షం కురిసింది. మణుగూరు కొత్తగూడెం, ఇల్లెందు సింగరేణి ఏరియాల్లోని ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద పెరగడంతో ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 6వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు తదితర మండలాల్లో భారీ వర్షంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. చత్తీస్‌గఢ్‌తో పాటు, చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. వరద తాకిడి పెరగడంతో ప్రాజెక్టు 12గేట్లను ఎత్తి 43వేల 543క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద ప్రస్తుత నీటి మట్టం 72.64 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 28, 290 క్యూసెక్కులుగా ఉంది. చాలా రోజుల తరువాత వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మిర్చి, వరి పంటలకు ఈ వర్షం అనువుగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో కొత్తగూడెంలో కలెక్టరేట్‌లో 08744-241950 నెంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూంకు తెలియచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సమాచారం ప్రకారం 4వ తేదీ వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తమ ప్రయాణాల్లో వాగులు ఎదురైతే వాటిని దాట వద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి ఇళ్లు, పాకల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. జిల్లా అధికారంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



మధిర ఆజాద్ రోడ్డులో వరద

అప్రమత్తంగా ఉండాలి..

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 31: భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ శాఖ ఖమ్మం జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది.. ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు అధికారయంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి శనివారంటెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో ముందు జాగ్రత్త చర్యలపె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ప్రజలు సహాయానికి 24 గంటల పాటు అందుబాటులో సిబ్బంది ఉంటారని తెలిపారు. ఏమైనా సహాయం కోసం 9063211298, టోల్‌ఫ్రీ నెం.1077కు కాల్ చేయాలని, ఫోన్ నెంబర్‌కు వాట్సాప్ కూడా చేయవచ్చని ఆయన తెలిపారు.

జిల్లాలోని చెరువులు, నీటి వనరులపై నిఘా పెట్టాలని అన్నారు. చెరువులు, వాగుల్లోకి ప్రజలు వెళ్ళకుండా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న చెరువులు, రిజర్వాయర్లు, కాల్వల నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువులు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకల వద్ద మత్తడి పొంగిపొర్లే ప్రాంతాలను గుర్తించి 24 గంటలు పర్యవేక్షించాలని అన్నారు.

జిల్లా అధికారులు తహశీల్దారులు, ఎంపీడీవో, ఎంపీవోలు భారీ వర్షాల నేపథ్యంలో హెడ్‌క్వార్టర్‌లో ఉండి సమన్వయంతో పని చేయాలన్నారు. చెరువులు, వాగుల వద్ద చేపలు పట్టడానికి అనుమతించవద్దన్నారు. కల్వర్టులు, రోడ్లపై ప్రవాహాలు వున్నచోట రహదారిని మూసివేయాలని, ప్రజలు దాటకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. నీటి ప్రవాహాల వద్ద వలంటీర్లను ఉంచాలన్నారు. బ్యారికేట్స్ అవసరం ఉన్న ప్రతిచోట పెట్టాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం అందుబాటులో ఉంచుకొని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్థి, జంతు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. దామిని యాప్ గురించి అవగాహన కల్పించి, పిడుగుల నుండి రక్షణ పొందేలా చైతన్యం తేవాలన్నారు. నీటి ప్రవాహాల వద్ద వలంటీర్లను ఉంచాలన్నారు. బ్యారికేట్స్ అవసరం ఉన్న ప్రతిచోట పెట్టాలన్నారు. ఈ సమీక్ష లో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈవో దీక్ష రైనా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి నాగలక్ష్మి, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

పాలేరు నుంచి నీటి విడుదల తగ్గింపు

కూసుమంచి, ఆగస్టు 31: పాలేరు జలాశయం నుంచి ఖమ్మం జిల్లా రెండో జోన్ ఆయకట్టుకు అధికారులు నీటివిడుదల తగ్గించారు. తుఫాన్ కారణంగా శనివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఆయకట్టులో నీటి డిమాండ్ తగ్గింది. రైతులు సాగర్ నీటి సరఫరా నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తుండటంతో ఆయకట్టుకు నీటివిడుదల తగ్గించినట్లు నీటి పారుదల శాఖ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. జలాశయం నుంచి ఎడమకాల్వకు కేవలం 1500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మొదటిజోన్‌నుంచి పాలేరుకు 4400 క్యూసెక్కులు, పాలేరు జలాశయం పరివాహకప్రాంతం నుంచి 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 23 అడుగుల నీటిమట్టానికి పాలేరులో ప్రస్తుతం 21.5 అడుగులమేర నీరు నిల్వ ఉంది. ఆదివారం మధ్యాహ్నానికి పాలేరు జలాశయం అలుగులు పారే అవకాశం ఉంది. పాలేరు జలాశయాన్ని అధికారులు సందర్శించారు. శనివారం ఉదయం నుంచి భారీ వర్షాలకు కురుస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ నాగరాజు, ఎంపీవో రామచంద్రరావు, ఐబీ డీఈ మధు తదితరులు పాలేరును సందర్శించారు. నీటిమట్టం పెరిగే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు, పాలేరు ఏటి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రాబడి ఉన్నా.. రాబట్టే ప్రయత్నమేదీ!?

(3వ పేజీ తరువాయి)

నోటీసులు అందించాల్సి ఉంటుంది. డివిజన్ల వారీగా డోర్‌టు డోర్ డిమాండ్ నోటీసులు సరఫరా చేయడంతోపాటు ఆయా యజమానులకు అవగాహన కల్పించి వారు పన్నులు చెల్లింపులు జరిపేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఖమ్మం కార్పొరేషన్‌లో మాత్రం అసలు డిమాండ్ నోటీసులు సరఫరా చేసే విధానానికి స్వస్తి పలికారు. గతేడాది నుంచి మాత్రం నేరుగా ఆయా ఇంటి యాజమానుల సెల్‌ఫోన్లకు సందేశాలు పంపించే కార్యక్రానికి శ్రీకారం చుట్టారు. కాని నేరుగా నిర్మాణాల దగ్గరకు వెళ్లి వారితో పన్నులను కట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా ఆదాయ లక్ష్యం పెరిగినా ఆ లక్ష్యాన్ని చేరుకోలేని పరిస్థితి ఏర్పడిందన్న వాదన వినిపిస్తోంది. అంతేకాదు గుర్తించిన భవనాల పన్నుల వసూళ్లతో పాటుగా నూతన భవనాలను గుర్తించి వాటిద్వారా ఆదాయ వసూళ్లు చేయాల్సిన ప్రత్యేక డ్రైవ్ సైతం మూలనపడినట్టుగా తెలుస్తోంది.

కారణాలివేనా..?

రెవెన్యూ బిల్ కలెక్టర్లకు ఇతర విధులు కేటాయించడమే పన్నుల వసూళ్లలో వెనకబాటుకు కారణమన్న వాదన వినిపిస్తుంది. రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహించాల్సిన బిల్ కలెక్టర్లను ఎన్నికలు, పారిశుద్ధ్య విధులు, డెంగీ కేసుల సర్వే వంటి వాటిల్లో నెలల తరబడి విధులు కేటాయిస్తున్నారు. దీంతో ఖమ్మం నగరంలో ఉన్న 60 డివిజన్లలో 20 రెవెన్యూ డివిజన్లలో క్రమపద్ధతిలో వసూళ్లు జరగటం లేదన్న విమర్శలున్నాయి. రెవెన్యూ విభాగంలో 30 మంది బిల్ కలెక్టర్లు ఉండగా వారిలో ఆరుగురు ఇటీవల బదిలీ జరగ్గా.. వారి స్థానంలో నూతన బిల్ కలెక్టర్లు రాలేదు. కాగా ఈ విషయంపై రెవెన్యూ అధికారి శ్రీనివాసరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆదాయంపై దృష్టి పెట్టామన్నారు. జనవరి నుంచి ఆదాయ వసూళ్లు అధికంగా ఉంటుందన్నారు.



ఆదాయ పెంపు కోసం భవనాల కొలతలు వేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి
కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
6
ఆదివారం 1 సెప్టెంబరు 2024



ఫెయిలయ్యే అవకాశం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను సవరించాలి: ఎస్ఈ

కొత్తగూడెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయ్యే అవకాశం ఉన్న వాటిని తనిఖీ చేసి లోపాలను సవరించాలని, ట్రాన్స్‌కో ఎస్ఈ జి.మహేందర్ తెలిపారు. శనివారం కొత్తగూడెం సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకే చేపట్టిన యూనిక్‌ఫోన్ నెంబరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అలాగే మొబైల్‌యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. ఎవరైతే కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు తమ యొక్క కేబుల్‌ను విద్యుత్ స్తంభాలపై వేసుకుంటున్నారో వాటిని ఒక క్రమ పద్ధతిలో సరి చేసుకుని బ్రేక్‌డౌన్ పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో ఎవరైతే అర్హత ఉండి గృహజ్యోతి లబ్ధిపొందని వినియోగదారులపై ప్రజాపాలన కార్యక్రమంలో తమ దరఖాస్తులను ఇవ్వడానికి అవగాహన కల్పించాలని ఎస్ఈ కోరారు.

‘పేట’లో 4 సెంమీ వర్షపాతం

పంటలకు ఊపిరి పోసిన వర్షం

అశ్వారావుపేట, ఆగస్టు 31: అశ్వారావుపేటలో శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం సాయంత్రం వరకు 40మిలీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు అయ్యింది. రాత్రి పొద్దుపోయాక వర్షం మరింత జోరుగా కురుస్తుంది. వర్షం వచ్చి చాలా రోజులు అవ్వడంతో మెరక పంటలు వాటేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇలాంటి పంటలన్నింటికి ఈ వర్షం ఊపిరి పోసినట్లయ్యింది. ఈ ప్రాంతంలో పత్తి, మినుము, నువ్వు, మొక్క జొన్న వంటి పంటలు వర్షాధారంమీద వేసినవి ఉన్నాయి. ఈ పంటలకు ఈ వర్షం పూర్తిగా ఊపిరి పోసినట్లయ్యింది. అలానే తోటలు, ఉద్యాన పంటలకు మేలు జరుగుతుంది. దుక్కులు, పై పాట్లు చేసుకునే అవకాశం కలుగుతుంది. దీనికి తోడు కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి తీవ్రంగా ఉన్న ఉడక పోతకు కొంత మేర ఉపశమనం కలిగినట్లయ్యింది. భారీ వర్షంతో పట్టణంలో రోడ్లన్ని జలమయంగా మారాయి. పల్లపు ప్రాంతాల ఇళ్ళ వాకిళ్ళలోకి నీరు చేరుతుంది. చెరువులు, చిన్న తరహా ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుంది. చాలా రోజులు తరువాత వర్షం కురుస్తుండటంతో రైతాంగంలో కొంత మేర ఆనందం వ్యక్తం అవుతుంది.

రైతుల్లో హర్షం

జూలూరుపాడు: మండలంలోని శనివారం తెల్లవారుఝాము నుంచి ఎడ తెరిపి లేని వర్షం కురిసింది. వర్షం రాకతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పత్తికి ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతులు అంటున్నారు.


వర్షంతో నిండిన కందులకుంట


జూలూరుపాడులో వర్షం

నాలుగు రోజులపాటు వర్షాలుకురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో మండలంలోని రైతులు ముమ్మరంగా మిర్చి తోటల సాగుచేపడుతున్నారు. వ్యవసాయ పనుల్లో రైతన్న నిమగ్నమయ్యారు. ఈ వర్షం పంటకు ఊపిరి పోస్తుందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దమ్మపేటలో భారీ వర్షం

దమ్మపేట: దమ్మపేట మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా శనివారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అతి భారీ వర్షం పడింది. దమ్మపేట, మందలపల్లిలో వర్షం నీరు మూడు అడుగుల మేర రోడ్డుపై నిలవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పట్వారిగూడెంలో రహదారిపై వరదనీరు భారీగా ప్రవహించింది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చెరువుల అలుగులు పారాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పలు సూచనలు చేశారు. భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

సమస్యల పరిష్కారం దిశగా అడుగులు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కూనంనేని

పాల్వంచ టౌన్, ఆగస్టు 31: సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అడుగులు వేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో కోటీ 83.20లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంఖుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, బస్తీల్లో పక్కా రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వివిధ పథకాలు, గ్రాంట్ల ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరికొన్ని పనులకు సంబంధించి నిధులను మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని, అధికార యంత్రాంగం నిత్యం పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అదికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషి, నిర్ణయాలతో నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరించుకుందామని అభివృద్ధిలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకున్నామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్, సీపీఐ, పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, రాహుల్, సుధాకర్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పబ్లిక్ హెల్త్, డీఈలు, ఏఈలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ప్రజలు అప్రమత్తంగా ఉండాలి’

కరకగూడెం, ఆగస్టు 31: మారుమూల గ్రామాలలో ప్రజలు వర్షాలు కురుస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం వైద్యాధికారి కారం మధు తెలిపారు. శనివారం మండలంలోని రాయణపేట, చిరుమళ్ళ ఆశ్రమపాఠశాల, అనంతారంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయణపేటలో 23 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. ఆశ్రమపాఠశాలలో 31 మంది విద్యార్థులకు వైద్య పరీక్షుల నిర్వహించగా నలుగురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. అనంతారంలో 38 మందికి వైద్య పరీక్షుల చేయగా ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు.

బుగ్గ, తోగు గ్రామాల్లో వైద్య శిబిరాలు


పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మణుగూరురూరల్, ఆగస్టు 31: మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది శనివారం మండలంలోని బుగ్గ, తోగు గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికంగా పలువురు గిరిజనులు జ్వరాలతో ఇబ్బందులు పడుతుండగా వారిని పరీక్షించి మందులను అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని కాచి వడబోసిన నీటిని తాగాలని వైద్యులు శివకుమార్ తెలిపారు. ప్రదానంగా నీరు నిల్వ ఉండకుండా దోమల లార్వాలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నేటినుంచి భగీరథ కార్మికుల సమ్మె

ఆ రెండు మండలాల్లో తాగునీటి సరఫరా బంద్
ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు లేవు
ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామంటున్న కార్మికులు

భద్రాచలం, ఆగస్టు 31: భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో ఆదివారం మంచినీటి సరఫరా నిలిచిపోనుంది. భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో మిషన్ భగీరథ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు. ఐదు నెలలుగా కాంట్రాక్టరు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను అడిగితే మాకు 18 నెలల వేతనాల బిల్లులు, మరమ్మత్తులకు సంబంధించినటువంటి బిల్లులు ప్రభుత్వం నుంచి రావడం లేదని పేర్కొన్నట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి విధులను బహిష్కరించి సమ్మెలోకి దిగుతున్నామని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా మిషన్ భగీరథ ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు గత 18 నెలలుగా ప్రభుత్వం వేతన బిల్లులు చెల్లించలేదని తెలుస్తోంది. అలాగే భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో ఇటీవల మూడేళ్ల కాలంలో నిర్వహించిన మరమ్మత్తులకు రూ.కోటి వరకు రావాల్సి ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ కార్మికులు సైతం సమ్మెలోకి దిగడంతో సమస్య జఠిలంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేటి నుంచి భగీరథ కార్మికుల విధుల బహిష్కరణ

దుమ్ముగూడెం: పెండింగు వేతనాలు చెల్లించని కారణంగా సెప్టెంబరు 1 నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు మండల మిషన్ భగీరథ ప్లాంటు కార్మికులు ప్రకటించారు. నిర్వాహణ కాంట్రాక్టరు ప్రతినిధులకు శనివారం నోటీసును అందజేశారు. కాంట్రాక్టరు గత ఐదు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భగీరథ కార్మికులు పవన్‌కు మార్‌రెడ్డి, దాసు, అశోక్, శ్రీను, సాయిచంద్, శ్రీకాంత్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఏమర్జెన్సీని ప్రకటించాలి


మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 31: గ్రామాల్లో, పట్టణాల్లో విష జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సీపీఎం రాష్ట్ర నాయకులు ఏజే. రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాలతో అల్లాడిపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి వైద్య శిబిరాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. వందలాది మంది ఇన్‌పేషెంట్లుగా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నప్పటికి వారికి సరైన వసతి కల్పించడం లేదని వాపోయారు. సమావేశంలో మండల కార్యదర్శి నబీ, అలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, సర్వన్‌కుమార్, ఎస్‌కే. ఖాదర్, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

‘బోధన మెళకువలు తెలుసుకోవాలి’


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ప్రభుదయాళ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 31: బోధన మెళకువలు ఉపాధ్యాయులు తెలుసుకోవాలని కొత్తగూడెం నోడల్ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ శనివారం సూచించారు. రామవరం స్కూల్ కాంప్లెక్స్ రివ్యూ సమావేశం నిర్వహించి పాఠశాలల రిపోర్టులను పరిశీలించి విశ్లేషించారు. విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలన్నారు. నోడల్ ఆఫీసర్ పాఠాన్ని బోధించి బోధన మెళకువలను ఉపాధ్యాయులకు విశ్లేషించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య


మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

అశ్వాపురం, ఆగస్టు 31: ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. శనివారం అశ్వాపురం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. రేషన్‌కార్డుల పేరుతో కొర్రీలు పెట్టడం మూలంగా రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సీతారామా ప్రాజెక్ట్ సాగునీటిని ముందుగా అశ్వాపురం మండలానికి ఇవ్వాలని, ఆ తర్వాత వేరే ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. సీతారామా ప్రాజెక్ట్ నీళ్ల తరలింపులో జిల్లాకు అన్యాయం జరిగితే రైతుల పక్షాన పోరాడతామన్నారు. సీజన్ వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారని, గ్రామాల్లో వెంటనే వైద్యశిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో రైతులకు ఎలాంటి షరతులూ విధించరాదని కోరారు. అందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ కార్యదర్శి పాయం నర్సింహరావు,జిల్లాకమిటీ సభ్యుడు గద్దల శ్రీను, నాయకులు పినికేశి సుధాకర్‌రెడ్డి, నాగభూషణం, అశోక్‌రెడ్డి,కొప్పుల పద్మ, దండి రాములు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల అనుమతికి ఆన్‌లైన్ చేసుకోవాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 31: గణేష్ మండపాల అనుమతి ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కోరారు. శనివారం పీస్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వినాయక మండపాల ఏర్పాటు నిమజ్జనాలలో తీసుకునే జాగ్రత్తలు గురించి గణేష్ మండప నిర్వహకులకు కొన్ని మార్గదర్శకాలు విడుదల చేశారు. గణేష్ మండపాల అనుమతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం వలన అన్ని రకాల అనుమతులు, పోలీసుల నుంచి పూర్తి సమాచారం ఇతర సౌకర్యాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, చుంచుపల్లి సీఐలు కరుణాకర్, రాయల వెంకటేశ్వర్లు, రమేష్, శివప్రసాద్, డివిజన్ ఎస్ఐలతో పాటు, రాజకీయ నాయకులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, రంగా కిరణ్, దార రమేష్, భీమా శ్రీధర్, రజాక్, అన్వార్, కాసుల వెంకట్, శ్రీరాములు, విశ్వహిందూ కమిటీ సభ్యులు గణేష్, క్రిస్టియన్స్ మత పెద్దలు పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్ఐల బదిలీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 31: భద్రాద్రి జిల్లాలో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ రోహిత్‌రాజు శనివారం ఉత్తర్వులను విడుదల చేశారు. అశ్వాపురం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బి.సురేష్‌ను పాల్వంచ రూరల్ ఎస్‌హెచ్‌వోగా, పాల్వంచ రూరల్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్‌ను వి.ఆర్ భద్రాద్రి జిల్లాకు, సిసిఎస్-2గా విధులు నిర్వహిస్తున్న కె.సుమన్‌ను పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌వోగా పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌వోగా పని చేస్తూ సస్పెన్షన్‌కు గురైన బి.రామును వీఆర్ భద్రాద్రి జిల్లాకు ఖమ్మం కమిషనరేట్‌లో పని చేస్తున్న టి.యయాతిరాజును అశ్వారావుపేట ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు.

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

దుమ్ముగూడెం, ఆగస్టు 31: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో శనివారం ఐద్వా మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

బీసీ గణన పూర్తైన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 31: బీసీగణన పూర్తైన తర్వాతనే వారికి పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని బహుజనసమాజ్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపాటి నరేష్ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులో జరి గిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టడంలో ప్రభు త్వం నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తుందని విమర్శించారు. ఎన్నికల్లో 42శాతం రిజ ర్వేషన్లు కల్పించనున్నట్లు ప్రకటించినప్పటికీ ప్రభుత్వం కులగణన విషయం లో తాత్సార వైఖరి అవలంబించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కాంపాటి సుందర్‌రావు, అశోక్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

‘ఇఫ్టూ సభలను విజయవంతం చేయాలి’

ఇల్లెందు టౌన్, ఆగస్టు 31: భారత కార్మికసంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జాతీయ 8వ మహాసభలు ఈ నెల 1, 2తేదీల్లో పూనెలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు బి.రాంసింగ్ తెలిపారు. శనివారం పట్టణంలోని జగదాంబ సెంటరులో మహాసభల విజయవంతానికై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రాంబాబు, కాంతారావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేయాలి

కొత్తగూడెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రంగయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య కోరారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గాలతో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతు రుణాలను ఎలాంటి ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని, రైతు భీమా పంటల బీమా రైతు భరోసా తదితర పథకాలను అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలని ఈ నెల 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్తా భిక్షం, నాయిని రాజు, అమర్లపూడి రాము, బుర్ర వెంకన్న, కల్లూరి కిషోర్, నూపా భాస్కర్, గోకినపల్లి ప్రభాకర్,లింగం, డి.ధర్మా పాల్గొన్నారు.

కరెంట్ లేదని ఇడ్లీలో కారం పొడి

మణుగూరు, ఆగస్టు 31: మణుగూరు ఏరియలో కొత్తగా ఏర్పాటు చేసిన సైట్ కార్యాలయ క్యాంటిన్ నిర్వహణ మొక్కుబడిగా సాగుతోందని, కరెంట్ లేదన్న నెపంతో చెట్నీకి బదులుగా కార్మికులకు ఇడ్లీల్లో కారం పొడి వేసి సరిపెట్టారంటూ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు ఎన్.వెంకట్ ఆరోపించారు. శనివారం ఏరియాలో జరిగిన ఈ ఘటన కార్మికులను ఎంతగానో నొచ్చుకునేలా చేసిందన్నారు. ప్రత్యామ్నాయాన్ని చూపాల్సిన అధికారులు పట్టింపు ధోరణిని కనబర్చడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా క్యాంటిన్ వసతులపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఆందోళనలు తప్పవని వెంకట్ హెచ్చరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం

మణుగూరు, ఆగస్టు 31: మణుగూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ నిర్వహణపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ముఖ్య అతిథిగా మహబూబాబాద్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 1నుంచి సభ్యత్వ నమోదును చేపట్టాలని సూచించారు. ప్రతి బూత్‌లో కనీసం 200 సభ్యత్వాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పినపాక కన్వీనర్ పున్నం భిక్షపతి, జిల్లా ప్రముఖ్ వెంకటేశ్వరరావు, చందర్ రావు, మధుసూధన్, వెంకటేశ్వర్లు, రామచందర్ రాజు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినానికి మద్దతు

చుంచుపల్లి, ఆగస్టు 31: పెన్షన్ విద్రోహ దిన నిరసన కార్యక్రమాలకు తెలంగాణ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిజిపిఏఎల్ఏ) తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నదని రాష్ట్ర అధ్యక్షుడు జి.ఉదయ్ భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జిల్లా స్థాయిలో చేపట్టే ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్, యూపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కావునా జిల్లాలోని టిజి జేఏసి సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, హాజరు కావాలని పిలుపునిచ్చారు.

5న కలెక్టర్ కార్యాలయం ముందు వ్యకాస ధర్నా

మణుగూరు , ఆగస్టు 31: పోడు భూముల పట్టాల కోసం 5న కలెక్టర్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్న కార్యాక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి రేసు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు పేరాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం మణుగూరులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ప్రతిఫలంగా 2005 అటవీ హక్కుల చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఇకనైనా సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొందె కుటుంబరావు, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ ఎన్నిక


కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగా కిరణ్

కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 31: కొత్తగూడెం గణేష్ నవరాత్రుల ఉత్సవ కమిటీని శనివారం కొత్తగూడెంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ రంగాకిరణ్, కార్యదర్శిగా దారా రమేష్ ఎన్నికయ్యారు. వీరితోపాటు గౌరవ అధ్యక్ష, మాజీ జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, వందనపు వెంకటేశ్వర్లతోపాటు ఉపాధ్యక్షులు యెర్రా కామేష్, లక్ష్మణ్, కురా శ్రీధర్, గొడుగు శ్రీధర్, కాసుల వెంకట్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రంగా కిరణ్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై 17వ తేదీన నిమజ్జన కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని, ఉత్సవకమిటీ మండపాల్లో కమిటీ సభ్యులతో కూడిన బ్యానర్లను ఏర్పాటుచేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. భక్తి ప్రపత్తులతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మెరుగు చింతేశ్వర్, యాకయ్య, విజయలక్ష్మి, సుజాత, సీత, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి: టీటీఎఫ్


ఆందోళన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి, ఆగస్టు 31: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కుంటల్ల పాఠశాలలో సీపీఎస్,యూసీఎస్ వద్దు ఓపీఎస్ ముద్దు అనే నినాదంతో సెప్టెంబరు 1న అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహించే ధర్నా, ప్రదర్శన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు ప్లకార్డుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 నుంచి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను రద్దు చేసి కొత్త పెన్షన్ విధానం(సీపీఎస్) అమలులోకి వచ్చిందని, ఉద్యోగ, ఉపాధ్యాయుల డబ్బును షేర్‌మార్కెట్‌లో పెట్టి ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవడమేనని, అలాంటి సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఓపీఎస్ లక్ష్యంగా సెప్టెంబరు 1న టీజీఈఏ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగాఅన్ని జిల్లా కేంద్రాలలో చేపట్టబోయె ర్యాలీ, ధర్నా కార్యక్రమాలలో టీఎస్‌టీటీఎఫ్ బాధ్యులు, సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, పూల్‌సింగ్, దేవ్‌సింగ్, రాంబాబు, భీముడు పాల్గొన్నారు.

టై, బెల్ట్‌ల అందజేత

బూర్గంపాడు, ఆగస్టు 31: బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శనివారం పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేశారు. పాఠశాలలోని సోషల్ ఉపాధ్యాయురాలు పద్మావతి తన మనవరాలు శ్రీ వర్ష మిహిర పుట్టినరోజు వేడుకలను కుటుంబసభ్యులు, విద్యార్థులతో కలిసి పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మనవరాలు పుట్టినరోజు సందర్భంగా 17వేల రుపాయల విలువైన టై, బెల్టులు విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారయణ, సిబ్బంది, ఉపాధ్యాయురాలి కుటుంబసభ్యులు పృధ్వి, మేఘమాల పాల్గొన్నారు.